# ఉషోదయం

-డా. కె. పద్మలత

ఉదయం ఏడు గంటలు. బాల్కనీలోకి వచ్చి బయటకు చూస్తూ "గౌరమ్మ ఇంకా రాలేదేంటి" అనుకుంది సంధ్య. అప్పటికి ఆమాట పదిసార్లయినా అనుకొని ఉంటుంది. అసలే ఏవేవో ఆలోచనలతో రాత్రి సరిగా నిద్రపోలేదు. తల భారంగా ఉంది. ఇప్పుడు ఈ పనంతా ఎలా చేసుకోవాలో. చికాగ్గా అనుకుంది. ఇంతలో గేట్ చప్పుడు కావడం, గౌరమ్మ హడావుడిగా లోపలికి రావడం జరిగి పోయాయి.

"అమ్మయ్య, వచ్చావా, ఇంత ఆలస్యంగా వచ్చావేంటి? ఈ పనంతా ఎలా చేసుకోవాలా అని భయపడుతున్నాను" సంధ్య అంది.

"ఏం జెయ్యాల్నమ్మా, రాత్రి ఇంట్లో ఒకటే లొల్లి. నిద్ర పోలేదు. చాతనయిత లేదు. ఒక్క మీ ఇంట్లోనే చేసి పోదామని వచ్చిన. ఇవాళ ఎవ్వరింట పనికి బోను" గౌరమ్మ విచారంగా అంది. ఏడ్చినట్టుగా ఆమె కళ్ళు వాచిపోయి ఉన్నాయి.

"ఏంటీ, మళ్ళీ మీ ఆయన తాగొచ్చి అల్లరి చేశాడా" కోపంగా అంది సంధ్య.

"కాదమ్మా, పెద్ద సమస్యొచ్చింది. పనయిన తర్వాత చెప్తా" అంటూ చీపురు చేతిలోకి తీసుకుంది. ఊడవడానికి.

ముప్పావు గంటలో గౌరమ్మ పనంతా చేసేసింది. సంధ్య ఇచ్చిన కాఫీ తాగి వంటింటి దగ్గర నేలమీద కూర్చుంది. "మీకు ఇంతకు ముందే ఓసారి చెప్పిన గాదమ్మా, మూడోసారి గూడ ఆడపిల్ల పుట్టిందని, మా ఆయన, అత్త కోపంగా ఉన్నారని"–

"ఔను, అయితే నీ చేతిలో ఏముంది. ఇప్పుడు నువ్వేం చేయగలవు. అయినా, పిల్ల పండులా ఉంది. చూసి సంతోషించక బాధేంటి".

"మా అటువంటాళ్ళకు అన్నీ బాధలే. మా అత్తకు దూరపు చుట్టం రంగమ్మ నిన్న వచ్చింది. నా చిన్న పిల్లను ఎవరికో ఇస్తే మూడు వేల రూపాయలిస్తరంట. అందుకని వాళ్ళకు పెంచుకుంటానికి ఇయ్యమని అడుగుతాంది. నేను ఇయ్యనని జెప్పిన. దాని గురించి రాత్రి నుండి లొల్లిజేస్తాంది" ఏడుస్తూ అంది గౌరమ్మ.

"అదేంటి, కన్న తల్లివి. నీ కిష్టం లేకుండా నీ బిడ్డను ఎవ్వరూ దూరం చేయలేరు. అయినా వీరేశంతో నేను మాట్లాడుతాలే. నువ్వేం బాధపడకు" జాలిగా చూస్తూ అంది సంధ్య.

గౌరమ్మ లేచి "మీ దయ, వానికి మీరే ఏదో ఒకటి చెప్పండి అమ్మా. నేను పోతున్నా" అని గౌరమ్మ వెళ్లిపోయింది.

సంధ్య నిట్టూర్చింది. "ఏంటో భగవంతుని లీల. ఎన్ని పూజలు, నోములు చేసినా పిల్లలు కలగని తనలాంటి వాళ్ళు కొందరైతే, వద్దంటుంటే పిల్లలు పుడుతున్న గౌరమ్మ లాంటి వాళ్ళు కొందరు" అనుకుంది.

"సంధ్యా!" భర్త పిలుపు విని 'వస్తున్నా' అంటూ లోపలికి వెళ్ళింది.

సంధ్య భర్త వేణుమాధవ్ బ్యాంకులో ఆఫీసర్‌గా పని చేస్తున్నాడు. అయిదంకెల జీతం. కారు, హైదరాబాద్‌లో సొంత అపార్టుమెంట్ ఉన్నాయి. వాళ్ళిద్దరినీ చూసిన వారు అదృష్టవంతులు అనుకుంటారు. అయితే వాళ్ళ జీవితంలో ఉన్న ఒకే ఒక లోపం పిల్లలు కలుగక పోవడం. పెళ్ళయి అయిదు సంవత్సరాలు దాటింది. మూడు సంవత్సరాల వరకు పిల్లలు పుట్టకపోవడాన్ని పెద్ద సీరియస్ విషయంగా తీసుకోలేదు. కాని, ఆ తర్వాత సంధ్య ధ్యాస పిల్లల మీదకు మళ్ళింది. పూజలు, వ్రతాలు మొదలు పెట్టింది. గత రెండు సంవత్సరాలుగా ఎంతోమంది డాక్టర్లను సంప్రదించారు. అతనిలోనే కొంత లోపముందని, మందుల ద్వారా ప్రయోజనం వుండ వచ్చునని రకరకాల మందులు వాడుతున్నారు.

ఆ రోజు భర్త బ్యాంకుకు బయలుదేరుతుంటే సంధ్య "ఏమండి, ఇవ్వాళ సాయంత్రం డాక్టర్ పల్లవి గారి దగ్గర అప్పాయింట్‌మెంట్

తీసుకున్నాను. మీరు అయిదు గంటల కల్లా వస్తే వెళ్ళి కలుద్దాం" నెమ్మదిగా అంది.

ఆమె వైపు చిరాగ్గాచూసి, "అలాగేలే" అంటూ వెళ్ళిపోయాడు. మొదట్లో సంధ్యలోనే ఏదైనా లోపముందేమోనని పరీక్షలు చేయించాడు. కాని, ఎప్పుడైతే ఆమెలో ఏ లోపము లేదని, డిఫెక్ట్ తనలోనే ఉందని తెలిసిందో అప్పటి నుండి వేణు మూడీగా మారిపోయాడు. సంధ్య పిల్లల ప్రస్తావన తెచ్చినప్పుడల్లా విసుక్కోవడం మొదలు పెట్టాడు. అయినా, సంధ్య చిన్నబుచ్చుకోకుండా అతనితో కలిసి డాక్టర్లను సంప్రదిస్తూనే ఉంది. రోజు రోజుకూ తల్లిని కావాలనే కోరిక ఆమెలో పెరిగి పోతూంది.

సాయంత్రం భర్తతో కలిసి డాక్టర్ పల్లవి నర్సింగ్ హోంకు వెళ్లింది సంధ్య. ముందు "పల్లవి సంతాన సాఫల్య కేంద్రం" అన్న బోర్డు చూసి "కనీసం ఇక్కడికి వచ్చిన తర్వాతనయినా తనకు సంతాన ప్రాప్తి ఉందో లేదో" అనుకుంటూ లోపలికి వెళ్ళింది. సుమారు గంటసేపు కూర్చున్న తర్వాత వారి వంతు వచ్చింది. ఇద్దరూ లోపలికి వెళ్ళారు. డాక్టర్ పల్లవి "కూర్చోండి" అని ఫోన్ ఎత్తి "రమేష్, మీరు ఒకసారి రావాలి" అని చెప్పి ఫోన్ పెట్టేసింది. సంధ్యకు ముళ్ళమీద కూర్చున్నట్టుగా ఉంది. వేణు పరిస్థితి కూడా అలాగే వుంది. ''డాక్టర్ గారేం చెప్తారో'' అనుకున్నారు. మూడు రోజుల క్రితం వచ్చి టెస్ట్ చేయించుకొని వెళ్ళారు. రిపోర్ట్ల కోసం తిరిగి మూడు రోజుల తర్వాత రమ్మనడంతో ఈ రోజు రావడం జరిగింది.

డాక్టర్ రమేష్ డోర్ తీసుకొని లోపలికి రావడంతో ఇద్దరూ లేచి నిల్చొని విష్ చేశారు. అతడు కూర్చుని "మీ రిపోర్ట్స్ వచ్చాయి. మీరేమీ ఫీల్ కాకపోతే మీకొక విషయం చెప్పాలి". నెమ్మదిగా అన్నాడు రమేష్. సంధ్య, వేణులకు చెమటలు వట్టేశాయి. గుండె వేగంగా కొట్టుకుంటున్నట్టనిపించింది.

"చెప్పండి" వేణు నెమ్మదిగా అన్నాడు.

"మీకు పిల్లలు పుట్టే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి. ఒక రకంగా లేనట్టే లెక్క" సూటిగా చూస్తూ అన్నాడు రమేష్. తలమీద బాంబు పడ్డట్టుగా అయింది భార్యాభర్తలకు. వేణు మొహం రక్తం లేనట్టుగా పాలిపోగా, సంధ్య కళ్ళు జలపాతాలయ్యాయి.

"అయితే, ఒకటి చేయొచ్చు" డాక్టర్ అన్నాడు. "మీ భార్యకు ఆర్టిఫిషియల్ ఇన్‌సెమనేషన్ ద్వారా గర్భం రావడానికి ప్రయత్నించ వచ్చు. సక్సెస్ కావడానికి అవకాశాలుంటాయి"--

"ఈ రోజుల్లో అది తప్పేం కాదు. పిల్లలు లేని చాలా మంది ఈ విధానం ద్వారా పిల్లలు పొందడానికి సుముఖత చూపిస్తున్నారు. అన్ని విషయాలు గోప్యంగా వుంచబడతాయి. మీకిష్టమైతే ప్రయత్నిద్దాం" డాక్టర్ పల్లవి అంది.

వేణు ఒక్క నిమిషం మౌనంగా ఉండి, ఆ తర్వాత

"థాంక్యూ డాక్టర్. మేము ఆలోచించుకొని చెప్తాం" అని లేచి నిల్చున్నాడు. సంధ్య కూడా అతనితో పాటు బయటకొచ్చింది.

ఇంటికి రాగానే వేణు తన రూంలోకి వెళ్ళి తలుపులు దగ్గరగా వేసుకున్నాడు. సంధ్యకు చాలా ఆందోళనగా వుంది. "ఏంటి, ఇలా జరిగింది. తన ఆశలన్నీ ఆవిరయి పోయినాయి. ఇంక ఈ జన్మకు తల్లిని కాలేను" బాధగా అనుకుంది. చాలా సేపు ఏడుస్తూ సోఫాలో కూర్చుంది. గౌరమ్మ రావడంతో లేచి కళ్ళు తుడుచు కొని కూర్చుంది.

"అప్పుడొచ్చి చూసి పోయిన, తాళం వేసుంటే, మళ్ళ ఇప్పుడొచ్చిన, చీకటయింది. తొందరగా పని జేసి పోవాలె" అని సంధ్యవైపు చూసి "ఏందమ్మా, ఒంట్లో బాగా లేదా" అని గౌరమ్మ అడిగింది.

"కొంచెం తల నొప్పిగా వుంది గౌరమ్మా" నవ్వు పులుముకుంటూ అంది.

"ఏడిగా టీ గాని, కాఫీగాని తాగండి".

"అలాగే" అంటూ కిచెన్‌లోకి వెళ్ళి కాఫీ కలిపి గౌరమ్మకు గ్లాసులో పోసిచ్చి, ఇంకా రెండు గ్లాసులలో తీసుకొని బెడ్ రూంలోకి వెళ్ళింది. కళ్ళపైన చేయి పెట్టుకొని పడుకొని ఉన్నాడు వేణు.

"కాఫీ తీసుకోండి" మెల్లిగా అంది సంధ్య.

"అక్కర్లేదు. తాగాలని లేదు".

"బాధపడి లాభం లేదు. మన అదృష్టమింతే అనుకొని ఏం చేయాలో ఆలోచిద్దాం" ఏడుపు ఆపుకుంటూ అంది సంధ్య.

"నాకెవరి సానుభూతి అక్కర్లేదు. ముందు

నువ్విక్కడి నుండి వెళ్ళు" కఠినంగా అన్నాడు వేణు.

సంధ్య ఉలిక్కిపడింది. "ఎప్పుడూ లేనిది ఇలా మాట్లాడుతున్నాడేంటి" అనుకొని మాట్లాడకుండా బయటకు వచ్చేసింది. సోఫాలో వెనక్కివాలి కళ్ళు మూసుకుంది.

గౌరమ్మ పని పూర్తికాగానే వచ్చి కూర్చుని "కొంచెం తక్కువైందామ్మా" అని అడిగింది.

"ఆ..." అని "మీ అమ్మాయి విషయం ఏమయింది" అని అడిగింది.

"వాళ్ళు ఎట్లయినా పిల్లను ఎవరికో ఇయ్యాలనుకుంటున్నారమ్మా. ముగ్గురు ఆడ పిల్లలను పెంచలేనంటున్నాడు" భగవంతుని మీద భారమేసినానమ్మా. ఏం జేయాల్లో వాడే జూస్తడు. పోతున్ననమ్మా. ఇంట్లో పోరగాండ్లు చూస్తుంటారు" అంటూ వెళ్ళిపోయింది.

రెండు రోజులు గడిచి పోయాయి. ఆరోజు మధ్యాహ్నం సంధ్య పేపర్ చదువుతూ పడుకుంది. కాలింగ్ బెల్ మోగిన చప్పుడు విని బయటికి వచ్చింది. ఎదురింట్లో ఉండే మీనాక్షి గారి రెండో కూతురు కుంకుమ భరిణ పట్టుకొని నిల్చుంది. "ఏంటీ విశేషం" నవ్వుతూ అడిగింది సంధ్య.

"ఈ రోజు మా అక్కయ్యకు సీమంతం చేస్తున్నాం. అమ్మ సాయంత్రం పేరంటానికి రమ్మంది" అంటూ బొట్టుపెట్టి వెళ్ళిపోయింది. సంధ్యకు మళ్ళీ మనసు భారంగా తయారయింది. "తను పేరంటానికి వెళ్ళలేదు. అక్కడ అమ్మలక్కలు వేసే ప్రశ్నలను చూపించే సానుభూతిని తను తట్టుకోలేదు. అయినా, తను గొడ్రాలు. అట్లాంటి ఫంక్షన్స్‌కు వెళ్ళకూడదు" కన్నీళ్ళు తుడుచుకుంటూ అనుకుంది.

## దీపం

**జీ**విత చరమాంకంలో
రెపరెపలాడుతున్న దీపాన్ని నేను
కన్నబిడ్డలు ఆప్యాయతానురాగాల
చమురు పోస్తే...
వెలుగుతాను
నిరాదరణ, నిర్లక్ష్యాల చమురు పోస్తే...
కొండెక్కుతాను

-కొప్పుల పద్మావతి

"ఆయన రెండు రోజుల నుంచి సరిగా మాట్లాడడం లేదు. మనసులో ఏముందో తెలియదు. ఈ సమస్యకు ఏదో ఒక పరిష్కారం ఆలోచించాలి. లేకపోతే లాభం లేదు" అనుకుంది. సడెన్‌గా మనసులో ఒక ఆలోచన తళుక్కుమంది అవును. అలా చేయాలి, బావుంటుంది". ఉత్సాహంగా అనుకొని వంట చేసుకోవడానికి వెళ్ళింది.

రాత్రి పడుకునే ముందు "ఏమండీ" మెల్లగా పిలిచింది. "ఏంటి" అన్నట్టుగా చూశాడు.

"పిల్లల గురించి ఇంకా బాధపడడం నాకిష్టం లేదు. అందుకే నేనొక నిర్ణయం తీసుకున్నాను" సంధ్య అంది.

"అంటే ఆర్టిఫిషియల్ మెథడ్స్‌లో పిల్లలను కనడానికి నువ్వు సిద్ధంగా ఉన్నావన్న మాట" ఆశ్చర్యంగా అని

"ఇంక నేనీ విషయం ఆలోచించ దలుచుకోలేదు. నీ ఇష్టమొచ్చినట్టు ఏడువ్. అయితే ఒక విషయం గుర్తుంచుకో. ఎవరి బిడ్డకో నువ్వు తల్లివి కాగలవేమో కాని నేను తండ్రిని మాత్రం కాలేను. అంత విశాల హృదయం నాకు లేదు". ఆమె వైపు కోపంగా చూస్తూ అన్నాడు.

సంధ్యకు ఏడుపొచ్చేసింది "ఎంతలేసి మాటలంటున్నాడు. మగబుద్ధి పోనిచ్చు కున్నాడు కాదు" బాధగా అనుకుని "నేను ఆలోచించేది ఆ విషయం కాదు. మనం మన గౌరమ్మ చిన్నకూతురిని పెంచుకుందాం" రోషంగా అంది సంధ్య.

వేణు ఆమె వైపు గిల్టీగా చూసి "సారీ సంధ్యా! నిన్ను అపార్థం చేసుకున్నాను" అని "ఎవరినైనా పెంచుకుంటే బాగుంటుందని నేనుకూడా అనుకుంటున్నాను. అయితే అనాథ శరణాలయానికి వెళ్ళి ఎవరినయినా తెచ్చుకోవచ్చు కదా. గౌరమ్మ కూతుర్నే ఎందుకు" అన్నాడు.

"వీరేశం ఎట్లాగు మూడు వేల రూపాయల కోసం ఎవ్వరికో ఇవ్వడానికి సిద్ధ మయ్యాడు. వాళ్ళు ఆ పిల్లనేం చేస్తారో అని గౌరమ్మ ఒకటే బాధ పడుతోంది. మనవే దాన్ని పెంచుకుంటామంటే వాళ్ళు చాలా సంతోషిస్తారు.

అదీకాక నేను ఆ అమ్మాయిని చూశాను. చాలా బావుంది. ఆడపిల్ల అన్న అభ్యంతరం మీకు లేకపోతే రేపు ఉదయం గౌరమ్మతో ఆ అమ్మాయిని తీసుకురమ్మని చెప్తాను. మీరు కూడా చూడండి. మీకు నచ్చితేనే పెంచుకుందాం. లేకపోతే మీరన్నట్టుగా అనాథ శరణాలయానికి వెళ్ళి ఎవరినయినా తెచ్చుకుందాం. ఒకటి మాత్రం నిజం. మనం పెంచుకోబోయే అమ్మాయైనా, అబ్బాయైనా మనిద్దరికీ నచ్చాలి. మనం వాళ్ళని ప్రేమగా పెంచుకోవాలి" సంధ్య అంది.

"ఆడ పిల్ల, మగ పిల్లలన్న తేడా నాకేం లేదు సంధ్యా. రేపు ఉదయం పాపను తీసుకొని రమ్మని. వీరేశంను కూడా రమ్మను. మాట్లాడుదాం" అన్నాడు వేణు.

ఆ రాత్రి సంధ్య ప్రశాంతంగా నిద్రపోయింది.

ఉదయం గౌరమ్మతో ఆమె కూతురిని పెంచుకుంటామని అడిగే సరికి ఆశ్చర్యంగా చూసింది. "అమ్మా! మీరు నా బిడ్డను పెంచుకుంటారా. నాకు తెలుసమ్మా. నేను దేవుణ్ణి నమ్మిన వాడు నాకు మంచే చేస్తాడు. నాకు తెలుసు. నాకేం బాధలేదమ్మా. నా బిడ్డ మీ దగ్గర దొరసాని లెక్క పెరుగుతుంది. ఉండమ్మా. ఆయనను తీసుకొస్తా" అని ఉత్సాహంగా వెళ్ళిపోయింది.

వీరేశం రాగానే వేణు విషయమంతా చెప్పి, "నువ్వు కేవలం మూడు వేల రూపాయలకు ఎవరికో ఇస్తానన్నావట. నేను పాప కోసం యాభై వేల రూపాయలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను. అయితే అవి నీకు డైరెక్టుగా ఇవ్వకుండా గౌరమ్మ పేరిట బ్యాంకులో వేస్తాను. నెలనెలా వడ్డీ కావాలంటే తీసుకోండి. అసలు డబ్బు మీ పిల్లలకు ఉపయోగ పడుతుంది. నీ కిష్టమైతే చెప్పు. తొందరేం లేదు. బాగా ఆలోచించుకొని చెప్పు. మేము చట్ట ప్రకారమే మీ బిడ్డను దత్తత తీసుకుంటాం. అందులో మోసమేమీ లేదు" అన్నాడు. సంధ్య భర్త వైపు మెచ్చుకోలుగా చూసింది.

వీరేశం తత్తరపడి "అయ్యా! మాకింతకన్న అదృష్టం ఏముంటుంది. మీరు చెప్పినట్లే కానీయండి. మా బిడ్డ అదృష్టవంతురాలు" అన్నాడు.

"ఇంకొక విషయం.మీ పాపను ఎప్పుడైతే మాకిస్తారో అప్పటి నుంచి దానికి తల్లీ, తండ్రీ మేమే. ఎట్టి పరిస్థితులలోను మీరు తల్లిదండ్రులని దానికి తెలియడానికి వీలు లేదు. మేము స్వార్థపరులమని మీరనుకున్నా ఫరవాలేదు. అదీకాక ఒక నెలరోజుల్లో నాకు విశాఖపట్నంకు ట్రాన్స్‌ఫర్ అవుతుంది. మేము వెళ్లిపోతాం. మీ కిష్టమైనప్పుడు వచ్చి పాపను చూడొచ్చు. మాకేం అభ్యంతరం లేదు" అన్నాడు వేణు.

"ఆ దేవుడు మా బిడ్డకు ఇంత మంచి తల్లిదండ్రులను చూపించినంక మాకేం బాధ సార్. మీరెట్ల చెప్తే అట్లానే వింటాం".

"సరే, దత్తత తీసుకోవడానికి కావలసిన ఫార్మాలటీస్ గురించి నేను కను క్కుంటాను. మీరు వెళ్ళండి" అన్నాడు వేణు.

రెండు నెలల తర్వాత విశాఖపట్నంకు ట్రాన్స్‌ఫర్ కావడంతో, అక్కడ ఇల్లు చూసుకొని వచ్చాడు వేణు. పాప దత్తత కార్యక్రమం కూడా పూర్తయింది. సామానంతా ట్రాన్స్‌పోర్ట్‌లో పంపించి కొంచెం లగేజీ, పాపతో సహా స్టేషన్‌కి వచ్చారు వేణు, సంధ్య గౌరమ్మా, వీరేశం కూడా స్టేషన్‌కి వచ్చారు. రైలు కదులుతుంటే కన్నీళ్లతో పాప వైపు చూస్తూ చేయి ఊపుతున్న గౌరమ్మను చూసి సంధ్య మనస్సు కలుక్కుమంది. తాను తల్లి నుండి బిడ్డను వేరు చేస్తోంది. పాపం. గౌరమ్మకు ఎంత బాధగా ఉందో" అనుకుని, అయినా "ఎలాగూ పాపనెవరికైనా ఇవ్వాలనుకున్నారు. తమకివ్వడం గౌరమ్మ కానందమే" అనుకుంది. తన ఒళ్లో పడుకున్న పాప వైపు తదేకంగా చూస్తున్న భర్తతో " ఏమండీ, దీనికొక మంచి పేరు సెలక్ట్ చేయండి" అంది.

"చీకటిగా ఉన్న మన జీవితాల్లోకి ఉషస్సులా ప్రవేశించింది గనక "ఉషస్వనీ" అని పేరు పెడదాం. ఎలా వుంటుంది" అన్నాడు వేణు.

"ఉషస్వనీ" అని ఉచ్చరించి "చాలా బాగుంది. ఔను. తమ జీవితాల్లో ఉషోదయం తొంగి చూస్తోంది. ఇంక ఏ బాధ లేదు. ఈ పాపను అపురూపంగా పెంచుకోవాలి" మురిపెంగా చూస్తూ అనుకుంది సంధ్య. ■